సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

పవర్‌ఫుల్

- 'ఉత్తర'లో నాణ్యమైన విద్యుత్ సరఫరా
- కొత్త సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, స్తంభాల ఏర్పాటు
- వినియోగదారుల హర్షం


లలితానగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన హై కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్


పోర్టు స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన కంటైనర్ సబ్ స్టేషన్


శ్రీనివాసనగర్‌లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడేవారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, లో వోల్టేజీ, తరచూ ట్రిప్పింగ్ సమస్యలతో అంతరాయం కలిగేది. గట్టిగా గాలి వీస్తే పాత విద్యుత్ కండక్టర్లు తెగిపోవడం, గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యేవారు. స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండేవి. పెరిగిన విద్యుత్ వినియోగానికి తగినట్టు ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ సరిపోక ట్రిప్పింగి అయ్యి విద్యుత్ సరఫరా ఆగిపోవడం, లో వోల్టేజితో విద్యుత్ పరికరాలు దెబ్బతినేవి. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ సమస్యలు మరింత అధికంగా ఉండేవి.

1.50 లక్షల మందికి ప్రయోజనం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యుత్ రంగంలో సంస్కరణలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు చొరవతో నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాలతో ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరాలో లోపాలను అధిగమించేలా సుమారు రూ.127 కోట్లతో వ్యవస్థను ఆధునికీకరించారు. ప్రస్తుతం ఉన్న పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. శిథిలమైన స్తంభాలను, దూరం ఎక్కువగా ఉన్న చోట మధ్యలో కొత్త స్తంభాలను, కొత్త విద్యుత్ కండక్టర్లు వేశారు. వీటన్నింటితో లో వోల్టేజీ లేకుండా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో లక్షా 50 వేల మంది వినియోగదారులకు ప్రయోజనం కలిగింది. మరో రూ.83 కోట్లతో విద్యుత్‌కు సంబంధించిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో కంటే నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఉత్తర'లో ఐదేళ్లలో చేపట్టిన విద్యుత్ పనులు

కొత్త సబ్ స్టేషన్లు (7)	రూ. 30.39 కోట్లు
కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు (71)	రూ. 27.64 కోట్లు
అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు	రూ. 37.57 కోట్లు
కొత్త విద్యుత్ స్తంభాలు (332)	రూ. 0.50 కోట్లు
కొత్త కండక్టర్లు (71)	రూ. 0.58 కోట్లు
కొత్త స్విచ్ గేర్లు(వీసీబీలు) (9)	రూ. 0.42 కోట్లు
విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులు(132)	రూ. 29.60 కోట్లు
33 కేవీ లైన్లు (3)	రూ. 0.15 కోట్లు
11 కేవీ లైన్లు (23)	రూ. 0.20 కోట్లు

లో వోల్టేజీ, ట్రిప్పింగ్ సమస్యలకు పరిష్కారం



గతంలో కంటే ఏసీలు, ఫ్రిజ్‌లు, మోటార్ల వినియోగం పెరిగింది. విద్యుత్ వినియోగానికి తగ్గట్టు కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లు లేక ట్రిప్ అవ్వడం, లో వోల్టేజీతో ఇబ్బంది పడేవారం. వేసవిలో సమస్య మరింత ఎక్కువగా ఉండేది. ఈ సమస్యలన్నీ పరిష్కరించేలా ఇటీవల కాలంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, హై కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.
– దుర్గారావు, అక్కయ్యపాలెం

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా



మునుపెన్నడూ లేనివిధంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతోంది. గతంలో వేసవి వచ్చిందంటే ఎప్పుడు ట్రిప్ అవుతుందో, విద్యుత్ సరఫరా నిలిచిపోతుందోనని భయపడేవారం. గట్టిగా గాలి వీచినా, వర్షం పడినా కండక్టర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ప్రస్తుతం అవన్నీ అధిగమించేలా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది.
– రాజగిరి సింహాచలం, శ్రీనివాసనగర్

30 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పాంచ రాత్ర ఆగమ సంప్రదాయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెనుమత్స సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి దర్శనం, అర్చన, పూజలు, భక్తుల సంకీర్తనలు, సామూహిక పారాయణం నిర్వహిస్తారు.

- 30న ఉదయం 6.30 గంటలకు యోగ సిద్ధాంజనేయ స్వామివారి దర్శనం, 7 గంటలకు అర్చన, 9 గంటలకు విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, రుత్విక్వరుణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, సాయంత్రం 5.30 నుంచి అష్టోత్తర శత కలశారాధన(108 కలశారాధన), తీర్థగోష్టి ప్రసాద వితరణ జరుగుతాయి.
- 31న ఉదయం 9 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతకలశ స్నపనం, అర్చన, తీర్థగోష్టి, ప్రసాద వితరణ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులచే సామూహిక సుందరకాండ పారాయణం, తమలపాకులతో అర్చన, రాత్రి 7 గంటలకు విశేష హోమం నిర్వహిస్తారు.
- జూన్ 1న ఉదయం 5 గంటలకు మంగళ ధ్వని 5.30కు సుప్రభాత సేవ, 6.30కు విశేష అలంకరణలో యోగ సిద్ధాంజనేయ స్వామి దర్శనం, 7 గంటలకు అర్చన, 8.30కు విశేష హోమాలు, పూర్ణాహుతి, 9.30కు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర నామార్చన, రాత్రి 8.30కు భజనానంద హారతి, రాత్రి 9 గంటలకు వేద ఆశీర్వచనం స్వస్తితో హనుమజ్జయంతి ఉత్సవాలు ముగుస్తాయి.

క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థినికి అభినందన


ఎండీ షబ్నీని అభినందిస్తున్న కాలేజీ సిబ్బంది

కంచరపాలెం: ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన థర్డ్ ఇయర్ ఫలితాల్లో కంచరపాలెం గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని మోహ్మద్ షబ్నీ బీ కామ్ డిగ్రీలో యూనివర్సిటీ థర్డ్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం గౌరీ కాలేజీలో షబ్నీని కళాశాల ప్రెసిడెంట్ డి.కె.ఎ.సత్యనారాయణ, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలతో ముందుగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.కుమారి, నూక అప్పారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


సీతమ్మధార ప్రధాన రహదారిలో జరుగుతున్న విస్తరణ పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు శరగవేగంగా జరుగుతున్నాయి. రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశారు. రహదారి విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


పరతాపు రాజేష్

మర్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం గెద్ద వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పరతాపు రాజేష్ ఓ మందుల షాపులో పనిచేస్తున్నాడు. ఇతడికి సుమారు పదేళ్ల నుంచి మతిమరుపు ఉంది. తల్లి మందులు వేసుకోమని చెప్పినందుకు ఆమెతో గొడవపడి ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటి వరకు చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అతడి తల్లి రాణి ఫిర్యాదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. రాజేష్ 5.2 అంగుళాల పొడవు, తెల్లరంగు ఛాయతో ఉంటాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు నల్ల జీన్ ప్యాంట్, గళ్ల షర్ట్ ధరించి ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు. హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్


సీతంపేటలో మెగా ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో దోమల నిర్మూలనకు సోమవారం సాయంత్రం మెగా ఫాగింగ్ నిర్వహించారు. బీటీఆర్ నగర్, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్‌నగర్, గొల్ల వీధి, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. నీరు నిల్వ ఉంచకుండా వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను నియంత్రించ వచ్చని స్థానికులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ సిబ్బంది సాయి, కె.శివ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి

జోరుగా వాహనాల తనిఖీలు

22 మందికి జరిమానా


ద్విచక్ర వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఎన్నికల కౌంటింగ్ డే సమీపిస్తున్న తరుణంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ తనిఖీలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఎస్ఐ జి.వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసి, వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన రికార్డులు లేని 22 వాహనాలకు రూ.8 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహన చోదకులతో మాట్లాడుతూ విధిగా అందరూ హెల్మెట్లు ధరించాలని స్పష్టం చేశారు. రాంగ్ పార్కింగ్ చేస్తే రూ.1,035 జరిమానా విధిస్తామని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ తొలేళ్ల సంబరం



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ, అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గానగర్ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అమ్మవారి తొలిప్రతిమకు పూజలు చేసి ఘటాల ఊరేగింపు ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు మొదలైన ఈ ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ మీదుగా తీసుకొచ్చి కంచరపాలెంలోని సీతారామాలయం, సంపత్ వేంకటేశ్వరాలయం, ధనలక్ష్మి ఆలయాల ఆవరణలో నిలిపారు. అనంతరం తోటవీధిలోని పుట్టబంగారం వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు పర్యవేక్షించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 250 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారితో నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, జేసీఐ భారత్ యువ సంకల్ప్ కన్సల్టెన్సీ సంయుక్తంగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించాయి. సర్వీస్, ఫైనాన్స్, బీమా, సాఫ్ట్‌వేర్ రంగాలకు సంబంధించి 32 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ విభాగాలకు సంబంధించి 650 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా, 250 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు ప్రాంభించిన కార్యక్రమంలో గ్లోబల్ ట్రస్ట్ నుంచి పి శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షుడు చంద్రశేఖర్, అమెజాన్ హెచ్ఆర్ ఆర్ సునీల్, ఫ్లిప్ కార్ట్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, వివిధ పరీక్షల ద్వారా పలువుర్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప విగ్రహ ప్రతిష్ఠ


వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: పాతనగరం వన్‌టౌన్ రాజప్ప నాయుడు వీధిలోని గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప భగవానుని పాలరాతి మూర్తులు ప్రతిష్ఠించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 25వ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఓం నమో భగవతే వాసుదేవాయ ద్వాదశాక్షరి కోటి లిఖిత మహా యజ్ఞంతో కూడిన స్థూపాన్ని ప్రారంభించారు. సంఘ సేవకుడు కొప్పుల రామ్‌కుమార్ ఈ స్థూపాన్ని ప్రారంభించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష మల్లెలతో అర్చన, 108 మామిడి ఫలాలతో అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చనతో సామూహిక సంపూర్ణ గీతా పారాయణ జరిపారు. గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ ఆఫీస్ పనుల పరిశీలన


కార్యాలయ మరమ్మతులను పరిశీలిస్తున్న ఏడీసీ విశ్వనాథన్


జోనల్ కార్యాలయం వద్ద జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, అధికారులు

సీతమ్మధార: ఆశీలమెట్ట వద్ద గల జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటిని సోమవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ పరిశీలించారు. ఆయనకు పనుల పురోగతి గురించి జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఇంజినీర్లు వివరించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ జోనల్ ఆఫీస్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

24వ వార్డులో ఏడీసీ పర్యటన

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో సోమవారం ఏడీసీ విశ్వనాథన్ పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. అనంతరం వివేకానంద కల్యాణ మండపం రోడ్డు నుంచి శివాలయం మీదుగా వీధిలోకి వెళ్లే కాలువలను, యూజీడీ పనులను పరిశీలించి, డ్రైనేజీ ఎత్తుపల్లాలను సరిచేయాలని ఇంజినీర్లకు ఆయన సూచించారు. కాలువల మీద అవసరమై చోట్ల గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఈ మేరకు అంచనాలు రూపొందించాలని చెప్పారు. స్థానిక ప్రజలను ఏడీసీ విశ్వనాథన్ సమస్యలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, సహాయ వైద్యాధికారి ప్రసాద్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఈఈ రమణమూర్తి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీ ఉన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం


అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో కూలిన చెట్టు వద్ద గుమిగూడిన జనం

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ పాలబూత్ సెంటర్‌లోని సాయిబాబా గుడి వద్ద సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో చెట్టు అకస్మాత్తుగా కూలిపోయింది. అటుగా వెళ్తున్న ఆటో ముందు భాగంపై పడటంతో ఆటో స్వల్పంగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఆటోలో ఉన్న వారికి కాని, చుట్టుపక్కల వారికి గాని ఏమీ కాలేదు. నిత్యం రద్దీగా ఉండే కూడలిలో చెట్టు పడే సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది సేపటి కిందటే భారీ కంటైనర్ అటువైపు వెళ్లిందని, దాని పైభాగం చెట్టు కొమ్మకు గట్టిగా ఢీకొట్టిందని, కంటైనర్ వెళ్లిన కొద్ది సేపటికి చెట్టు కూలిపోయింది స్థానికులు తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగించి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం

మహారాణిపేట: వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమంపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రోగ్రాం అధికారుల సమావేశంలో రుతుక్రమం-ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ అని, సాధారణంగా 10 నుంచి 14 ఏళ్ల లోపు మొదలై 45-49 ఏళ్ల మధ్యలో రుతుక్రమం ఆగిపోతుందని చెప్పారు. 'టుగెదర్ ఫర్ ఏ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్' (నెలసరి సమయంలో స్నేహపూర్వకంగా ఉండటం) ఈ ఏడాది నినాదమని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు అందుబాటులో శానిటరీ నాప్‌కిన్‌లు, ఐరన్ పోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వైద్యులు. సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకిరువైపులా పార్కింగ్‌తో ఇక్కట్లు


నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డులో పార్క్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24, 23 వార్డుల పరిధిలోని రోడ్లకు ఇరువైపులా కార్లు, ద్విచక్ర వాహనాలు పార్క్‌చేయడంతో స్థానికులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుకు రెండువైపులా కార్లు నిలిపివేయడంతో రాకపోకలకు కష్టంగా ఉందని స్థానికులు, పాదచారులు చెబుతున్నారు. నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డులో ఒక వైపు కార్లు.. కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనాలు రోడ్డుపై నిలపివేస్తున్నారు. మరో పక్క కార్ మెకానిక్ షెడ్లు ఉండటంతో వచ్చిన వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిపివేయడంతో రహదారి ఇరుగ్గా మారింది. గతంలో ఈ రోడ్డులో కారు అదుపు తప్పి ఒక ఇంటిపైకి దూసుకుపోవడంతో మహిళ మృతి చెందిన ఘటన జరగడం తెలిసిందే. అదే రోడ్డులో వ్యాపారులు, తోపుడుబళ్లు, దుస్తుల దుకాణదారులు వాహనాలు నిలిపి వేస్తున్నారు. ఇంటి సామగ్రి రోడ్డుపైనే వేయడంతో రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అభినవ సౌబల'కు ఘన సత్కారం


రొంగలి రాములును సత్కరిస్తున్న అమరావతి విశ్వసాహితి సభ్యులు

మురళీనగర్: అభినవ సౌబల బిరుదు పొందిన రంగస్థల నటుడు రొంగలి రాములును అమరావతి విశ్వసాహితి సభ్యులు ఘనంగా సత్కరించారు. మురళీనగర్ భరద్వాజ క్షేత్రంలో సోమవారం నిర్వహించిన విశ్వసాహితి ప్రత్యేక సమావేశంలో రొంగలి రాములు నిర్వహించిన పౌరాణిక పాత్రల ప్రతిభను, ఆయనలోని సద్గుణాలను వక్తలు శ్లాఘించారు. తనను సత్కరించిన సభ్యులను రాములు కృతజ్ఞతలు తెలిపారు. కవి సమ్మేళనంలో విశ్వసాహితి ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన సూర్యనారాయణ, పిల్లా అర్జునుడు, పొలమరశెట్టి ఫ్రాన్సిస్, పి.వి.ఎల్.ప్రసాద్, తిరుపతిరావు, రాంతాత, పి.రామారావు, కె.కృష్ణ, ఎ.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, డి.ఎస్.కుమార్, కె.రామారావు, బి.వి.రమణమూర్తి, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com